సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 27 । మే । 2024



కల్యాణ వైభోగమే..

నారాపురస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం భూదేవి, శ్రీదేవి సమేత నారాపుర వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. -8లో



మదనపల్లెలో దొంగల బీభత్సం

మదనపల్లె పరిధిలోని ఇళ్లలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఇళ్లలో చొరబడి అందిన కాడికి దోచుకెళ్లారు. పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.340	రూ.428
రెండోరకం	రూ.230	రూ.320



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 628 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	415	415
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 66.440 కిలోలు

న్యూస్‌రీల్

పవిత్ర హజ్‌యాత్ర అవకాశమే అదృష్టం



మాట్లాడుతున్న మత గురువు మౌలానా మౌల్వి షేక్ రషీద్ అహ్మద్

కడప కల్చరల్: పవిత్రమైన హజ్ యాత్ర చేసే అవకాశం రావడమే ముస్లింల జీవితాలకు గొప్ప అదృష్టమని మత గురువు మౌలానా మౌల్వి షేక్ రషీద్ అహ్మద్ అన్నారు. ఆదివారం కడపలోని కృష్ణా సర్కిల్‌లో సంస్థ కార్యాలయంలో హజ్ యాత్రికులకు ప్రత్యేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. అతిథులుగా రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ బీఎస్ గౌసులాజం, ఎమ్మెల్సీ సి.ఇషాక్‌బాషా, నగర ప్రముఖులు ఎస్‌బీ అహ్మద్‌బాషా కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ ఇషాక్ అలీ, సయ్యద్ హిదాయతుల్లాలు హాజరై మాట్లాడారు. జీవితంలో హజ్ యాత్ర చేసే అవకాశం రావడాన్ని ప్రతి ముస్లిం ఓ అదృష్టంగా భావించవచ్చన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతి కోసం, ప్రజల క్షేమం కోసం ప్రత్యేకంగా ప్రార్థించాలని సూచించారు. రషీద్ అహ్మద్ హజ్ యాత్ర నియమ నిబంధనల గురించి వివరించారు. 40 రోజులపాటు జరిగే ఈ యాత్రలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. అనంతరం యాత్రికులకు వ్యాక్సినేషన్ చేసి హజ్ యాత్రలో ఉపయోపగడే వస్తువులతో కూడిన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ ఎంపికలకు 150 మంది హాజరు



క్రీడాకారులకు సూచనలు ఇస్తున్న సీఏవైడీ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-16 క్రికెట్ ఎంపికలకు క్రీడాకారుల నుంచి స్పందన లభించింది. ఈ ఎంపికలను క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-16 వయస్సు క్రికెట్‌లో ఎంతో కీలకమైనదన్నారు. ఉన్నతశ్రేణి క్రికెట్ ఆడేందుకు ఇందులో రాణించడం ద్వారా అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తొలుత ప్రాబబుల్స్‌కు ఎంపిక చేసి సెలక్షన్ మ్యాచ్‌లు నిర్వహించి తుదిజట్టును ఎంపిక చేస్తామని తెలిపారు. అనంతరం బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన 60 మంది క్రీడాకారులను ప్రాబబుల్స్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు వై. శివప్రసాద్, అబ్దుల్ రెహమాన్ ఫరూఖ్, కె. విష్ణు మోహన్‌రావు, శ్రీకాంత్‌రెడ్డి, సాయిఈశ్వర్‌రెడ్డి, జగదీష్‌కుమార్, భరద్వాజ్, సలీంబేగ్, ఎం.సాయిపృథ్వీతేజ్, కోచ్‌లు ప్రసాద్, అబూబకర్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్

- ఓట్ల లెక్కింపునకు యంత్రాంగం సన్నాహాలు
- జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఆరు అసెంబ్లీ, ఒక పార్లమెంటు స్థానానికి కౌంటింగ్
- కౌంటింగ్‌కు సుమారు 1500కు పైగా అధికారులు, సిబ్బంది
- అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రత
- జిల్లా వ్యాప్తంగా కొనసాగనున్న 144 సెక్షన్



ఓట్ల లెక్కింపు కేంద్రంలో అధికారులతో చర్చిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్(ఫైల్)

సాక్షి రాయచోటి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రోజురోజుకు అందరిలోనూ టెన్షన్ అధికమవుతోంది. ఓట్ల లెక్కింపు పూర్తయితే తప్ప ఉత్కంఠకు తెరపడదు. అయితే ఎక్కడ చూసినా గెలుపుపైన ఒకవైపు బెట్టింగ్‌ల పర్వం కొనసాగుతుండగా, మరోవైపు అన్ని పార్టీల్లోనూ నరాలు తెగే టెన్షన్ నెలకొంది. ఇంకోవైపు అధికార యంత్రాంగం కౌంటింగ్‌కు సన్నద్ధమవుతోంది. మరో వారం రోజుల్లో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

కౌంటింగ్ సిబ్బంది నియామకం

కౌంటింగ్‌ను పురస్కరించుకుని ఇప్పటికే సంబంధిత అధికారులు, సిబ్బందిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ నియమించారు. ప్రధానంగా సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, సూక్ష్మ పరిశీలకులు, ఇతర సిబ్బంది నియామక ప్రక్రియ చేపట్టారు. కౌంటింగ్‌కు జిల్లాలో సుమారు 1500కు పైగా సిబ్బందిని వినియోగిస్తున్నారు. ఎక్కడా కూడా చిన్నపాటి సమస్య కూడా ఉత్పన్నం కాకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటూనే మరోవైపు సిబ్బందికి కౌంటింగ్‌పై శిక్షణ కూడా ఇస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా భారీ బందోబస్తు

ఓట్ల లెక్కింపు జరిగే రాయచోటితోపాటు మిగతా అన్ని ప్రాంతాల్లో 144 సెక్షన్ ద్వారా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో కూడా మూడంచెల భద్రత కొనసాగుతోంది. కౌంటింగ్ రోజు రాయచోటి కడప రింగ్‌రోడ్డు సర్కిల్ నుంచి వేంపల్లె రోడ్డు సర్కిల్ వరకు మెయిన్‌రోడ్డును పూర్తిగా మూసివేయనున్నారు. ఈ రోడ్డులో కౌంటింగ్ కేంద్రం ఉండడంతో వాహనాల రాకపోకలను కౌంటింగ్ రోజు పూర్తిగా నియంత్రించి ట్రాఫిక్‌ను దారి మళ్లించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా 144 సెక్షన్‌తోపాటు ఇతర సమస్యాత్మక ప్రాంతాల్లో బందోబస్తు పరంగా పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టనున్నారు.

ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన

రాయచోటి టౌన్: జూన్ 4వతేదీ నిర్వహించే సార్వత్రిక ఎన్నికల ఓట్ల కౌంటింగ్ నిర్వహణ కార్యక్రమాన్ని అధికారులు పరిశీలించారు. ఆదివారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణంలో కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ రామచంద్రరావు అధికారులకు సూచించారు. చిన్నపాటి పొరపాట్లకు కూడా తావు లేకుండా గట్టి భద్రత కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ఆ ప్రాంతాన్ని తహసీల్దార్ జయన్న ఆధ్వర్యంలో మండల సర్వేయర్ మదన మోహన్‌రెడ్డి పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులు, అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో ఓట్ల లెక్కింపు


అన్నమయ్య జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు రాజంపేట లోక్‌సభకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ జిల్లా కేంద్రమైన రాయచోటిలో జూన్ 4న చేపట్టనున్నారు. పట్టణంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఇందుకు సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 13వ తేదీ పోలింగ్ ప్రక్రియ ముగియగానే ఈవీఎంలను జిల్లా కేంద్రంలో భద్రపరిచారు. జిల్లా వ్యాప్తంగా 609 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా భారీ ఎత్తున ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈవీఎంలలో ఓటర్ల తీర్పు నిక్షిప్తమై ఉంది. ఒక్కో నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 14 టేబుళ్ల కౌంటింగ్ పూర్తయ్యాక ఒక రౌండ్‌గా పరిగణించి ఫలితాలు వెల్లడిస్తారు.



ఓట్ల లెక్కింపు జరిగే సాయి ఇంజినీరింగ్ కళాశాల

రౌండ్ల వారీగా ఫలితాల వెల్లడి

జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి రౌండ్ల వారీగా ఫలితాలను వెల్లడించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో రైల్వేకోడూరుకు సబంధించి 18 రౌండ్లు, రాయచోటికి 21 రౌండ్లు, తంబళ్లపల్లె 17, పీలేరు 20, మదనపల్లె 18 లేదా 19, రాజంపేట 20 లేదా 21 రౌండ్లలో ఫలితాలను వెల్లడించను న్నారు. అందుకు సంబంధించి అధికార యంత్రాంగం విస్తృతంగా ఏర్పాట్లు చేస్తోంది.



కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు

జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా అన్ని చర్యలు చేపడుతున్నాం. ఎక్కడా కూడా చిన్నపాటి ఘటనకు కూడా తావు లేకుండా అధికారులను అప్రమత్తం చేశాం. ఏజెంట్లు, అభ్యర్థుల సమక్షంలో పోస్టల్ బ్యాలెట్ మొదలుకొని ఈవీఎంలోని ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే పార్టీల ఏజెంట్లకు గుర్తింపు కార్డులను జారీ చేయనున్నాం. కౌంటింగ్ సిబ్బందిని కూడా ఇప్పటికే నియమించి శిక్షణ ఇచ్చాం. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా గొడవలు జరగకుండా అన్ని చర్యలు చేపడుతున్నాం. రాజకీయ పార్టీలతోపాటు ప్రజలు కూడా ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించాలి. - ఎం.అభిషిక్త్ కిశోర్, జిల్లా ఎన్నికల అధికారి, రాయచోటి

అశ్వ వాహనంపై చెన్నకేశవుడు



వెల్లాలలో అశ్వ వాహనంపై ఊరేగుతున్న ఉత్సవ మూర్తులు

రాజుపాళెం: మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజైన ఆదివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాములను అశ్వ వాహనంపై ఊరేగించారు. ముందుగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిపై కొలువుదీర్చారు. అనంతరం పురవీధుల్లో ఊరేగించారు. దేవస్థానాల చైర్మన్ బి.జగదీశ్వర రెడ్డి, ఈఓ నరసయ్య, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు: మండలంలోని వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాల్లో తిరునాల సందర్భంగా శని, ఆదివారాలకు సంబంధించి ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ చైర్మన్ బి.జగదీశ్వర రెడ్డి, పర్యవేక్షణాధికారి ఆర్ఆర్ నరసింహా సింగ్, ఈఓ బీవీ నరసయ్యల ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. అందులో రూ.1,34,137 వచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల ఆశీస్సులు

ఉత్తర అమెరికా ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి రత్నాకర్



దివంగత సీఎం వైఎస్‌రాజశేఖరరెడ్డికి నివాళి అర్పిస్తున్న రత్నాకర్, చిల్లా కిరణ్‌రెడ్డి తదితరులు

రాజంపేట : ప్రజల ఆశీస్సులతో వైఎస్ జగన్ దిగ్విజయం సాధించబోతున్నారని ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి (ఉత్తర అమెరికా) పండుగాయల రత్నాకర్ అన్నారు. ఆదివారం యూఎస్‌ఏ సోషల్ మీడియా కో-కన్వీనర్ చిల్లా కిరణ్‌రెడ్డి, పలువురు ఎన్నారైలతో కలిసి ఇడుపులపాయ వైఎస్సార్ ఘాట్‌ను వారు సందర్శించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 9న విశాఖలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రమాణస్వీకారం చేయడం తథ్యమని సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేసిన మంచి ఆయనను గెలిపించబోతోందన్నారు. దేశం మొత్తం ఏపీ వైపు చూసేలా, మరోచరిత్రకు నాంది పలకబోతున్నారన్నారు. యూఎస్‌ఏ సోషల్ మీడియా కో-కన్వీనర్ చిల్లా కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో అత్యధికంగా మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికి మేలు చేయడమేనన్నారు.

రేపు జాబ్ మేళా

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక మైదుకూరు రోడ్డులోని నాగార్జున ఐటీఐలో మంగళవారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. కొప్పర్తి సమీపంలోని ఎలక్ట్రానిక్ కంపెనీలో ఉద్యోగాల కోసం ఈ మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలకు 8247575462 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జిల్లా క్రికెట్ జట్టుకు నందలూరు క్రీడాకారులు



జాఫర్ అలీ



ఆదిల్ హుస్సేన్



పృథ్వీరాజ్



శంకరాచారి




గిరీష్ తేజ

నందలూరు: కడప జిల్లా సీనియర్స్ క్రికెట్ జట్టుకు నందలూరు క్రికెట్ సబ్ సెంటర్ నుంచి ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. జాఫర్ అలీఖాన్, ఆదిల్ హుస్సేన్, పృథ్వీరాజ్, మారుతీ శంకరాచారి, గిరీష్ తేజ, స్టాండ్‌బైగా హరిప్రసాద్ ఎంపికైనట్లు హెడ్‌కోచ్ గయాజ్ తెలిపారు. నందలూరు సబ్ సెంటర్ నుంచి గతంలో కూడా అండర్ 12, 14, 16, 19, 23 సీనియర్ విభాగాలలో రాష్ట్రస్థాయి క్రికెట్‌కు ఎంతోమంది క్రీడాకారులు ఎంపికయ్యారన్నారు. ఈ ఏడాది కూడా ఆరుగురు క్రీడాకారులు సీనియర్ జట్టుకు ఎంపిక కావడంపై అసిస్టెంట్ కోచ్ ఫిరోజ్ ఖాన్ లోడి, ట్రైనర్ శివకోటి, క్యూరేటర్ హరికృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

వెంటాడుతున్న ఓటమి భయం!

- కారణాలు వెతుక్కుంటున్న టీడీపీ నేతలు
- తెరపైకి కడప, కమలాపురం, ప్రొద్దుటూరు నియోజకవర్గాలు
- వెన్నుపోట్లంటూ నివేదికలు సిద్ధం చేసుకున్న అభ్యర్థులు
- 29న చంద్రబాబును కలిసి ఫిర్యాదు చేయనున్న వైనం
- మదనపల్లె, తంబళ్లపల్లె అభ్యర్థులపై కేడర్ ఫిర్యాదు



సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు ఓటమి భయం పట్టుకుంది. అధినేత చంద్రబాబుకు వివరించేందుకు కారణాలు వెతుక్కుంటున్నారు. వెన్నుపోటు రాజకీయాలంటూ నివేదికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఇదే తరహా ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మరో ఇద్దరు తెరపైకి వచ్చారు. ఈనెల 29న విజయవాడలో స్వయంగా కలిసి పరిస్థితి వివరించేందుకు సిద్ధం అయ్యారు. సక్సెస్‌ఫుల్ ప్రయత్నాలు చేసినా పార్టీ నేతల వెన్నుపోటుతో దెబ్బ పడిందనే అంచనాకు వచ్చారు.

- వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలు వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా నిలుస్తున్నాయి. ఇదివరకు ఎన్నికలు ఏవైనా సరే ఫలితాలు ఏకపక్షంగా వచ్చాయి. 2024 ఎన్నికల ఫలితాలు అదేబాటలో ఉండనున్నాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం కళ్లముందు కనిపిస్తోంది. ఈ పరిస్థితిని పసిగట్టిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఓటమిపై సాకులు వెతుకుతున్నారు. సహచరులు ఆశించిన స్థాయిలో పనిచేయకపోగా, వెన్నుపోటు పొడిచారని నివేదికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే కడప, ప్రొద్దుటూరు, కమలాపురం టీడీపీ అభ్యర్థులు.. పార్టీ నేతలు వెన్నుపోటుకు పాల్పడ్డారని ఆరోపణలకు దిగారు. అదే విషయాన్ని అధినేతకు వివరించేందుకు సిద్ధమయ్యారు.

అన్నమయ్య జిల్లాలో..

ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఆశించిన స్థాయిలో పోరాటం చేయలేదని, పోల్ మేనేజ్‌మెంట్ చేపట్టలేదనే అన్నమయ్య జిల్లా టీడీపీ కేడర్ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తోంది. ఇప్పటికే మదనపల్లె టీడీపీ అభ్యర్థి షాజహాన్‌పై రామసముద్రం మండల మాజీ జెడ్పీటీసీ మునివెంకటప్పతోపాటు ఆ మండల కేడర్ మూకుమ్మడిగా ఫిర్యాదు చేశారు. పోరాటం చేయకపోగా కేడర్‌ను అవమానాలపాలు చేశారని అధ్యక్షుడు చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. అలాగే తంబళ్లపల్లె, రాజంపేట అభ్యర్థులు జయచంద్రారెడ్డి, బాలసుబ్రమణ్యంపై కూడా కేడర్ ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తోంది. ఆశించిన స్థాయిలో అభ్యర్థులు ఎఫర్ట్ పెట్టలేదని, పోల్ మేనేజ్‌మెంట్‌లో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపణలు చేస్తున్నారు. ఇరువురు టికెట్ తెచ్చుకునే క్రమంలో పార్టీపై చేసిన పోరాటం క్షేత్రస్థాయిలో చేయలేదనే ఆరోపణలు బాహాటంగా చెప్పుకొస్తున్నారు. అదే విషయాన్ని రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తున్నట్లు సమాచారం.

చంద్రబాబును కలిసేందుకు సన్నాహాలు...



టీడీపీ అధినేత చంద్రబాబును కలిసేందుకు ప్రొద్దుటూరు, కమలాపురం టీడీపీ అభ్యర్థులు నంద్యాల వరదరాజులరెడ్డి, పుత్తా కృష్ణచైతన్య రెడ్డి సిద్ధం అయ్యారు. ఆమేరకు బుధవారం విజయవాడలో కలవనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రొద్దుటూరు ఇన్‌చార్జి గండ్లూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ప్రొద్దుటూరులోనూ, కమలాపురంలోనూ పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారనే ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తోంది. ఓవైపు వైఎస్సార్‌సీపీ నేతల మద్దతు పెంచుకుంటున్న తరుణంలో టీడీపీ నేతలు పార్టీకి దెబ్బకొట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆమేరకు ఇరువురు ఆధారాలు సేకరించి నివేదికలు సిద్ధం చేసుకుంటున్నారు. ప్రొద్దుటూరులో ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో సహా ఆయన సన్నిహితులు టీడీపీకి పనిచేయలేదని వరదరాజులరెడ్డి, స్వగ్రామం కోగటంలో టీడీపీకి వ్యతిరేకంగా పనిచేశారని చైతన్యరెడ్డి కలిసికట్టుగా ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. మరోవైపు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి సైతం శల్యసారథ్యం వహించారని ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తోంది. అధిష్టానం సూచనల మేరకు పార్టీ ఫండ్ అప్పగించడంలో కూడా విఫలయయ్యారని ఆధారాలతో అందజేయనున్నట్లు సమాచారం. కాగా, కార్పొరేటర్ ఉమాదేవి కుటుంబంపై ఇప్పటికే జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఫిర్యాదు చేశారు. పార్టీ విజయం కోసం పనిచేయలేదని ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.

గజరాజుల గణన!



- ముమ్మరంగా ఏనుగుల జాడ సేకరణ
- ఇప్పటి వరకు 65 ఏనుగుల సంచారం
- శేషాచలంలో 100కి పెరిగే పరిస్థితి
- తమిళనాడు, కర్ణాటక సరిహద్దుల నుంచి రాకపోకలు
- ఆసియాటిక్ రకం ఏనుగులకు నిలయం
- గజరాజుల సంరక్షణ దిశగా చర్యలు



శేషాచలం అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగులు

రాజంపేట: కేంద్ర అటవీశాఖ ఆదేశాల మేరకు అటవీశాఖ శేషాచలం దట్టమైన అటవీ ప్రాంతంలో గజరాజుల గణనను నిర్వహిస్తోంది. జిల్లాలో బాలపల్లె, కోడూరు, రాజంపేట, సానిపాయి రేంజ్‌లో గజరాజుల గణన ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో శేషాచలం విస్తరించి ఉంది.

ఆసియాటిక్ రకం ఏనుగులు...

శేషాచలంలో ఆసియాటిక్ రకం ఏనుగులు తమ సంతతిని పెంచుకుంటూ వస్తున్నాయి. మగ ఏనుగులలో పెద్ద దంతాలు ఉంటాయి. పాక్షిక-సతత హరిత అడవులు, పొడిముళ్ల అడవులలో నివాసం ఏర్పరచుకుంటాయి. ఆసియా ఏనుగు ఆసియాలో అతి పెద్ద భూమి జంతువు. 70 సంవత్సరాలకంటే ఎక్కువగా జీవిస్తుంది. చెవులు చిన్నవిగా ఉంటాయి. 5వేల కిలో గ్రాముల బరువు ఉంటాయి.

ముమ్మరంగా ఏనుగల జాడ సేకరణ

శేషాచలంలో ఏనుగుల జాడ సేకరణను క్షేత్రాధికారులు, సిబ్బంది చేపట్టారు. ఇప్పుడు అటవీ సిబ్బంది అడవిబాట పట్టారు. ఏనుగులు వచ్చిపోయిన ప్పుడు పేడ, అడుగులు, వాటి సంచారపు ఆనవాళ్లను గుర్తిస్తున్నారు. ఏనుగులు ఎన్ని వచ్చాయి, ఎందుకు వస్తాయి లాంటి అంశాలతో గణన జరుగుతోంది.

తమిళనాడు, కర్ణాటక సరిహద్దుల నుంచి..

తమిళనాడు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లోని దట్టమైన అరణ్య ప్రాంతాల నుంచి శేషాచలంలోకి ఏనుగులు గుంపులుగా ప్రవేశిస్తాయి. శేషాచలంలో సంచరించి తిరిగి ఎక్కడి నుంచి వచ్చాయో అక్కడికి వెళుతుంటాయి. ఈ విధంగా అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలోని శేషాచలం అటవీ ప్రాంతాలలో ఏనుగుల సంచారం కొనసాగుతోంది.

100కి ఏనుగుల సంఖ్య పెరగవచ్చు..

శేషాచలంలో ఏనుగుల సంఖ్య వంద వరకు పెరగవచ్చని అటవీశాఖ వర్గాలు భావిస్తున్నాయి. వీటి సంఖ్య పెరిగే కొద్ది అందుకు తగ్గట్టుగా అటవీశాఖ వాటి పరిరక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఏనుగులు సంచరించే ప్రాంతాల విస్తీర్ణం పెరిగితే ఎలిఫెంట్ లైన్‌గా గుర్తించాల్సి ఉంటుంది. శేషాచలంలో తమకు అనువైన ప్రదేశాలలో ఏనుగుల గుంపులు సంచరిస్తున్నాయి. ఆకలి, దాహార్తి లాంటి వాటి కోసం అవి అడవి దాటుతున్నాయి. అలా దాటకుండా అడవిలోనే అన్నీ ఉండేలా చేయాలంటే, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహాయక చర్యలు చేపట్టేందుకు గజరాజుల గణన అటవీశాఖకు దోహదపడుతుంది.


ఎక్కడెక్కడ సంచరిస్తాయంటే...

శేషాచలం అటవీ ప్రాంతం రాజంపేట, తిరుపతి డివిజన్ పరిధిలో విస్తరించి ఉంది. ఏనుగుల గుంపులు చిత్తూరు జిల్లా నుంచి జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉన్న అటవీ ప్రాంతానికి వస్తూపోతుంటాయి. పింఛా, చెయ్యేరు, గుంజననది నదీ పరీవాహక ప్రాంతాలకు కూడా ఏనుగులు వచ్చిపోతుంటాయి. గతంలో రైల్వేకోడూరు అటవీ రేంజ్ పరిధిలో ఏనుగులబావి, దొంగబండ, రాజంపేట రేంజ్ పరిధిలో ఈతకాయలబండ, తుమ్మలబైలు, పింఛా అటవీ పరిసర ప్రాంతాల్లోని అంబానిబావి సమీపంలో ఏనుగుల గుంపులు సంచరించాయి.

60 ఏనుగుల సంచారం

శేషాచలంలో విస్తరించిన దట్టమైన అటవీ ప్రాంతంలో 60 ఏనుగుల వరకు సంచరిస్తున్నాయి. వీటి కదలికలను అటవీశాఖ ఎప్పటికప్పుడు గుర్తిస్తోంది. గత గణన ద్వారా 60 ఏనుగులు ఉన్నట్లుగా అటవీ అధికారులు గుర్తించారు. అటవీ ప్రాంతంలో ఏనుగులకు తాగేందుకు సరైన రీతిలో వనరులు లేకపోతే అవి దాహార్తి కోసం.. అలాగే ఆకలి తీర్చుకునేందుకు అటవీ సమీపంలో ఉన్న తోటలపై పడుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. వేసవిలోనే ఏనుగుల గుంపు తోటలపైకి రావడం అధికమవుతోంది.

శేషాచలంలో లెక్కింపు ప్రక్రియ



శేషాచలంలో ఏనుగుల లెక్కింపు ప్రక్రియ జరుగుతోంది. వాటి సంచారం ఎక్కడెక్కడ అనేది కూడా తెలుసుకుంటున్నాము. ఏనుగుల సంఖ్య పెరిగి ఉంటుందని భావిస్తున్నాము. గణన ద్వారా ఏనుగుల జీవనానికి సంబంధించి ఏ విధంగా నిర్ణయాలు, వాటి అవసరాలు తదితర వాటిపై నిర్ణయం తీసుకునేందుకు ఈ గణణ దోహదపడుతుంది. శేషాచలంలో ఆసియాటిక్ ఏనుగులు ఉన్నాయి. - తూమాటి నాగమణీశ్వరి, ఇన్‌చార్జి జిల్లా అటవీఅధికారి

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నరసింహులు

చిన్నమండెం : మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసింహులు(35) మృతి చెందినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. దేవగుడిపల్లె హరిజనవాడకు చెందిన నరసింహులు ద్విచక్ర వాహనంలో వస్తున్నారు. మండల కేంద్రంలో గురు హోటల్ సమీపంలోని జాతీయ రహదారిపై లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య పల్లవి ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో పడి..

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు వ్యాసరాయ చెరువు తూము సమీపంలో ఎర్రప్ప(70) మృతదేహాన్ని స్థానికులు ఆదివారం గుర్తించారు. చెరువు ఆహ్లాదకర వాతావరణాన్ని వీక్షించేందుకు వెళ్లిన పలువురు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రవీంద్రబాబు సిబ్బందితో కలిసి చెరువు వద్దకు చేరుకుని శవాన్ని పరిసరాలు పరిశీలించారు. ఓ చెట్టు వద్ద లభ్యమైన దుస్తులు, పాదరక్షలు, ఆధార్ కార్డుతో పాటు ఇటీవల చింతామణిలోని ఆసుపత్రిలో చికిత్స పొందిన ప్రిస్క్రిప్షన్ లభించాయి. మందులతో పాటు పురుగు మందు డబ్బాను తనిఖీ చేశారు. మృతి చెందిన వ్యక్తి కర్నాటక రాష్ట్రం కోలార్ జిల్లా శ్రీనివాసపురం సమీపంలోని సనకంవారిపల్లి గ్రామానికి చెందిన చిన్నమద్దన్న కుమారుడు ఎర్రప్పగా పోలీసులు నిర్ధారించారు.

డీజిల్ చోరీ కేసులో ముగ్గురు అరెస్ట్



డీజిల్ నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

పీలేరురూరల్ : డీజిల్ చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ మోహన్ రెడ్డి తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో నిందితుల అరెస్ట్ చూపిన అనంతరం సీఐ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా శాంతిపురం మండలానికి చెందిన సురేష్‌కుమార్, నాగరాజ, కార్తీక్ రోడ్డు రోలర్, ప్రొక్లెయిన్ ట్యాంక్ నుంచి డీజిల్ చోరీ చేస్తున్నారన్నారు. ముగ్గురుని అరెస్ట్ చేసి వారి వద్ద 200 లీటర్ల ఆరు క్యాన్లు, రూ.18,500 నగదు, ఇనుక కమ్మి, రబ్బరు పైపు, వాహనం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరసింహుడు, సిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లెలో ప్రజా సంఘాల భూదందా

కొంతమంది స్వార్థపరులు కొత్త ప్రజా సంఘాలు, సొంత సంఘాలను ఏర్పాటుచేసుకుని భూ వివాదాలతో సెటిల్మెంట్లు, దందాలు చేస్తున్నారు. బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలవాల్సిన వారు.. ధనార్జనే ధ్యేయంగా, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి మదనపల్లెలో జరిగిన బహుజన భీమ్‌సేన అధ్యక్షుడు శేషాద్రి హత్యే ఇందుకు అద్దం పడుతోంది.

- భూ తగాదాల్లో సభ్యుల మితిమీరిన జోక్యం
- చట్టాలను ఆసరాగా చేసుకుని అమాయకులపై పెత్తనం
- పరపతి, పలుకుబడితో మాట నెగ్గించుకునే ప్రయత్నం
- పుంగనూరు శేషాద్రి హత్యతో వెలుగుచూస్తున్న అక్రమాలు



మదనపల్లె : పట్టణంలో పలు ప్రజా సంఘాలు బడుగు, బలహీన పేదలకు అండగా నిలబడుతూ, న్యాయం చేసేందుకు ఆందోళనలు, ఉద్యమాలు చేసి పోరాడుతూ, ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కొన్ని ప్రజా సంఘాలు.... సివిల్, రెవెన్యూ, క్రిమినల్, కుటుంబ వ్యవహారాలు, పోలీస్ స్టేషన్లలో పంచాయతీలు, ప్రేమ వ్యవహారాలు, ఆర్థిక లావాదేవీలు, ఇలా అన్ని వ్యవహారాల్లో తమదైన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ అమాయకులకు అన్యాయం చేస్తున్నారు. చట్టంలోని లొసుగులను అనుకూలంగా మార్చుకోవడం, అధికారుల అలసత్వం, అవినీతిని ఆసరాగా చేసుకోవడం వారికి వెన్నతో పెట్టిన విద్య. అన్నింటిలోనూ తమ మాటే నెగ్గేలా చూసుకొనేందుకు వ్యతిరేకించిన వారిని నయానా, భయానా బెదిరించి, భయపెట్టి లొంగదీసుకుంటున్నారు. ఎదురు తిరిగిన వారిని మట్టుబెడుతూ... సామాన్యుల్లో భయాన్ని ఉసిగొల్పేలా ప్రవర్తిస్తున్నారు.

భూముల ధరలు పెరగడమే కారణం

మదనపల్లె పట్టణం చుట్టుపక్కల వందల ఎకరాల్లో విలువైన ప్రభుత్వ భూములున్నాయి. వాటి విలువ అమాంతం పెరగడంతో కోట్లు వెచ్చించైనా ఆ స్థలాలు కొనుగోలు చేసేందుకు ఉద్యోగ, వ్యాపారస్థులు ముందుకు వస్తున్నారు. ఇదే ప్రజా సంఘాలకు ఆదాయవనరుగా మారుతోంది. ఎస్సీ, ఎస్టీ, మిలిటరీ, అసైన్డ్ భూములు, ఇందిరమ్మ ఇళ్లు, వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లకు సంబంధించి వివాదాలను సెటిల్మెంట్ చేయడంలో కొన్ని ప్రజా సంఘాలు కీలకంగా మారాయి. కోట్ల రూపాయలు సులువుగా వచ్చే మార్గం కావడంతో మెల్ల మెల్లగా ప్రజాసంఘాల మధ్య పోటీ ఏర్పడింది.

యువతను పురిగొల్పుతూ..

ఒకప్పుడు గుర్తింపు పొందిన ప్రజాసంఘాల్లో పనిచేసి, తర్వాతి కాలంలో వేరుకుంపట్లు పెట్టుకుని జాతీయ, రాష్ట్ర అధ్యక్షులుగా చెలామణి అవుతున్నారు. యువకులను కూడగట్టి కొందరితో గ్యాంగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఉద్యమాల పేరుతో తమ స్వప్రయోజనాలకు వాడుకుంటూ, సెటిల్మెంట్లు, దందాల్లో గొడవలు, ఘర్షణలకు వినియోగిస్తున్నారు. రాజకీయ పార్టీల నాయకులకు సైతం తమ మద్దతు తెలుపుతూ.. క్షేత్ర స్థాయిలో తమ పరపతి, పలుకుబడిని పెంచుకుంటున్నారు. ఈ ఆధిపత్య పోరులో ఇటీవల హత్యకు గురైన ఓ ప్రజాసంఘం నాయకుడి మృతికి ఎలాంటి సానుభూతి వ్యక్తం కాలేదు. పోలీసులు సైతం ప్రజాసంఘాల నాయకులకు స్టేషన్లలో గౌరవమర్యాదలు కల్పించడంతో పాటుగా వారు మధ్యవర్తిత్వం చేసిన కేసులవైపే మొగ్గుచూపుతున్నారు. సబ్ రిజిస్ట్రార్, రెవెన్యూ, హౌసింగ్ తదితర ప్రభుత్వకార్యాలయాలను తమ దందాలకు వేదికలుగా మార్చుకుంటూ వారి వ్యాపారం మూడుపువ్వులు, ఆరుకాయలుగా కొనసాగిస్తున్నారు. పోలీసులు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా చర్యలు చేపట్టి, ప్రజాసంఘాలను నియంత్రించకపోతే, రానున్న రోజుల్లో మరిన్ని అసాంఘిక ఘటనలు జరిగే ప్రమాదం లేకపోలేదు.

శేషాద్రి హత్య ఘటనపై దర్యాప్తు వేగవంతం

- హత్యాస్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ ప్రసాదరెడ్డి
- పోలీసుల అదుపులో ఏడుగురు నిందితులు



మృతుడు శేషాద్రి ఇంటిపరిసరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి

మదనపల్లె : పట్టణంలో సంచలనం సృష్టించిన పుంగనూరు శేషాద్రి హత్య కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. మంజునాథ కాలనీలోని హత్య జరిగిన ప్రదేశాన్ని డీఎస్పీ ప్రసాదరెడ్డి ఆదివారం మరోసారి పరిశీలించారు. స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. శేషాద్రి ఇంటిలో హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం హత్యలో భాగస్వామ్యులైన నిందితుల్లో నలుగురు లొంగిపోగా, విచారణలో భాగంగా మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మరిత మంది హత్యకేసులో పాల్గొన్నట్లు నిర్ధారణకు వచ్చి, వారికోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు సిద్ధం

- రేపటి నుంచి వన్డే మ్యాచ్‌లు ప్రారంభం
- 28 నుంచి జూన్ 3 వరకు నిర్వహణ

తేదీ	తలపడే జట్లు	మైదానం
28-05-24	అనంతపురం X కడప	కేఎస్ఆర్ఎం
28-05-24	చిత్తూరు X కర్నూలు	కేఓఆర్ఎం
29-05-24	కర్నూలు X నెల్లూరు	కేఎస్ఆర్ఎం
29-05-24	కడప X చిత్తూరు	కేఓఆర్ఎం
31-05-24	అనంతపురం X చిత్తూరు	కేఎస్ఆర్ఎం
31-05-24	కడప X నెల్లూరు	కేఓఆర్ఎం
01-06-24	చిత్తూరు X నెల్లూరు	కేఎస్ఆర్ఎం
01-06-24	అనంతపురం X కర్నూలు	కేఓఆర్ఎం
03-06-24	కడప X కర్నూలు	కేఎస్ఆర్ఎం
03-06-24	అనంతపురం X నెల్లూరు	కేఓఆర్ఎం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రీడా మైదానాలు వేదికగా ఏసీఏ సౌత్‌జోన్ సీనియర్ విభాగం అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ మ్యాచ్‌లు ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 3వ తేదీ వరకు ఈ మ్యాచ్‌లను నిర్వహించనున్నట్లు సౌత్‌జోన్ కన్వీనర్ ఎ.రెడ్డి ప్రసాద్ తెలిపారు. మ్యాచ్‌ల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

ముగ్గురు అరెస్టు

పీలేరురూరల్ : డీజిల్ చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో నిందితుల అరెస్ట్ చూపిన అనంతరం సీఐ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా శాంతిపురం మండలానికి చెందిన సురేష్‌కుమార్, నాగరాజ, కార్తీక్ రోడ్డు రోలర్, ప్రొక్లెయిన్ ట్యాంక్ నుంచి డీజిల్ చోరీ చేస్తున్నారన్నారు. ముగ్గురుని అరెస్ట్ చేసి వారి వద్ద 200 లీటర్ల ఆరు క్యాన్లు, రూ.18,500 నగదు, ఇనుక కమ్మి, రబ్బరు పైపు, వాహనం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

గడ్డివామి దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నిమ్మనపల్లె : మండలంలోని రాచవేటివారిపల్లెలో ఆదివారం గడ్డివామి దగ్ధమై సుమారు రూ.30 వేల ఆస్తినష్టం జరిగింది. స్థానికుడు రవీంద్రనాథరెడ్డి పశువుల మేత కోసం వేయి కట్టలతో గడ్డివామి ఏర్పాటుచేశారు. గ్రామంలో టపాకాయలు పేల్చడంతో ప్రమాదవశాత్తూ గడ్డికి నిప్పంటుకుంది. మదనపల్లె అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించగా ఎస్ఐ నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే గడ్డి పూర్తిగా దగ్ధమైంది.

మదనపల్లెలో దొంగల బీభత్సం



చంద్రశేఖర్ ఇంటిలో చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



ఓబుళ్‌రెడ్డి ఇంట్లో దొంగలు చొరబడి చెల్లాచెదురు చేసిన బీరువా

- రూ.30 లక్షల విలువగల నగలు, నగదు అపహరణ
- క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు

మదనపల్లె : మదనపల్లె పరిధిలోని ఇళ్లలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఇళ్లలో చొరబడి అందిన కాడికి దోచుకెళ్లారు. ఒకే రోజున రూ. లక్షల విలువగల నగదు, నగలు అపహరించుకుపోయారు. బాధితుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణంలోని రామిరెడ్డి లే అవుట్‌లో నివాసముంటున్న చంద్రశేఖర్ తన కుటుంబసభ్యులతో రాజానగర్‌లో బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంటి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దొంగలు తలుపులు పగలగొట్టి ఇంట్లోకి చొరబడి దొరికిన కాడికి దోచుకెళ్లారు. చంద్రశేఖర్ తిరిగి వచ్చి చూడగా తలుపులు బద్దలు కొట్టి ఉండడ, బీరువా తెరచి ఉండడంతో వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.25 లక్షల విలువగల భార్యకు సంబంధించిన అరకిలో బంగారు నగలు, రెండు కిలోల వెండి ఆభరణాలు, రూ.1.5 లక్షల నగదు చోరీకి గురైనట్లు చంద్రశేఖర్ పేర్కొన్నారు. అదే విధంగా పట్టణంలోని నీరుగట్టువారిపల్లె కోళ్లబైలు రోడ్డులోని నివాసముంటున్న రైతు ఓబుల్‌రెడ్డి తన బంధువుల ఆహ్వానం మేరకు ఆదివారం ఉదయం పెద్దమండ్యంలోని జాతరకు వెళ్లాడు. అతడి భార్య శాంతమ్మ మామడి గుంపులపల్లె వద్ద ఉన్న పొలానికి వెళ్లారు. అనంతరం ఓబుళ్‌రెడ్డి ఇంటికి తిరిగి వచ్చి చూడగా తలుపులు తెరచి ఉండడం, బీరువా తలుపులు తెరచి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో సుమారు 50 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.పది వేల నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వన్‌టౌన్ సీఐ వల్లిబసు, సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించి ఆధారాలు సేకరించారు. ఒకే రోజున రెండు భారీ చోరీలు జరగడంతో మదనపల్లె ప్రజలు ఆందోళనకు గురయ్యారు. పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారం

సివిల్ సర్వీసెస్ ర్యాంకర్ శ్రీనివాసులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు పోవాలని సివిల్ సర్వీసెస్ ర్యాంకర్ కన్నెబోయిన శ్రీనివాసులు అన్నారు. స్థానిక పద్మశాలీయ కళ్యాణమండపంలో ఆదివారం ది బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో పది, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చూపిన వారికి పురస్కారాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువకులు పత్రికల్లో ఎడిటోరియల్ పేజీ చదవాలని సూచించారు. ఎస్కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్.కృష్ణుడు మాట్లాడుతూ ఓటమితో కుంగిపోకుండా ధైర్యంగా ముందుకు పోవాలని చెప్పారు. ది బీసీ ప్రజాచైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు మాట్లాడుతూ బీసీ విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 14 ఏళ్లుగా ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నామన్నారు. అనంతరం 40 మంది విద్యార్థులకు రూ.1.60 లక్షల నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సమాఖ్య ఉపాధ్యక్షుడు భాస్కర్‌యాదవ్, కోశాధికారి మడకా సంటెయ్య, భాస్కర్‌రావు, బీసీ నాయకులు పాణ్యం సుబ్బరాయుడు, కరుణాకర్ యాదవ్, వుట్టి వీరయ్య, మల్లెల భాస్కర్, జింకా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పొలం తగాదాల్లో ఐదుగురికి గాయాలు

మదనపల్లె : పొలంలో జరిగిన వివాదంలో ఇరు వర్గాల్లోని ఐదుగురు వ్యక్తులు గాయపడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మండలంలోని దుబ్బిగానిపల్లెకు చెందిన అలివేలమ్మ, నారాయణమ్మలకు 1.45 ఎకరాల భూమికి సంబంధించి వివాదం ఉంది. ఇటీవల భూమి విషయమై కోర్టులో కేసు వేశారు. ఆదివారం అలివేలమ్మ తన తమ్ముడు వెంకటరత్నం, కుటుంబసభ్యులతో కలిసి పొలంలో కంచె ఏర్పాటు చేస్తుండగా, నారాయణమ్మ కుటుంబ సభ్యులతో కలిసి కోర్టు వివాదంలో ఉన్న భూమికి కంచెవేసి దారిలేకుండా చేస్తే ఎలా అని ప్రశ్నించింది. ఇరువర్గాలు గొడవపడ్డారు. ఈ గొడవలో ఓ వర్గంలోని అలివేలమ్మ(55), ఆమె తమ్ముడు వెంకటరత్నం(48) గాయపడగా, మరో వర్గంలోని నారాయణమ్మ(60), పార్వతమ్మ(45), హరినాథ్(32) గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో బాలిక మృతి



బ్రాహ్మణి మృతదేహం

వేంపల్లి : విద్యుత్ షాక్‌కు ఇందుకూరు బ్రాహ్మణి(12) ఆదివారం మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని ముత్తుకూరు గ్రామానికి చెందిన ఎర్రన్న, లక్ష్మీదేవి దంపతులకు కుమార్తె బ్రాహ్మణి, కుమారుడు ఇందువర్ధన్ ఉన్నారు. తల్లి లక్ష్మీదేవి ఇంట్లో దుస్తులు శుభ్రం చేసి, కుమార్తె బ్రాహ్మణిని దుస్తులు మిద్దెపై ఆరబెట్టాలని చెప్పింది. కుమార్తె మిద్దెపై దుస్తులు ఆరబెట్టే క్రమంలో అదుపు తప్పి విద్యుత్తు తీగలపై పడడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. 20 నిమిషాలైనా కుమార్తె కిందకు రాకపోవడంతో తల్లి లక్ష్మీదేవి మిద్దె పైకెక్కి బ్రాహ్మణి తీగలపై పడి ఉండడం చూసి కేకలు పెట్టింది. స్థానికులు విద్యుత్తు తీగలు తొలగించి హుటాహుటిన వేంపల్లి ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే బ్రాహ్మణి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రగోపాల్‌రెడ్డి, పోలీస్ గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

లింగాల : మండలంలోని ఇప్పట్ల గ్రామం సమీపంలో ద్విచక్ర వాహనం నుంచి కింద పడి ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. బిదినంచర్లకు చెందిన నారాయణరెడ్డి(70), బోనాలకు చెందిన రామకృష్ణారెడ్డి ద్విచక్రవాహనంలో ఇప్పట్ల మీదుగా తమ గ్రామానికి వెళ్తున్నారు.

ఇప్పట్ల సమీపంలోకి చేరగానే.. వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అంకెవానిపల్లె గ్రామంలో జాతరకు వెళ్లి పులివెందులకు వస్తున్న వైఎస్.అభిషేక్‌రెడ్డి ప్రమాదం చూసి గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ నారాయణరెడ్డి మృతి చెందారు. రామకృష్ణారెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తరలించారు.

అనుమానాస్పదంగా ఉపాధ్యాయుడి మృతి



మృతి చెందిన జయప్రకాష్ నారాయణ

మియాపూర్ : అనుమానాస్పద స్థితిలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ దుర్గా రామలింగ ప్రసాద్ వివరాల మేరకు.. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన శ్రీనివాస్, సరస్వతి దంపతులకు కుమారుడు జయప్రకాష్ నారాయణ(35), కుమార్తె ప్రశాంతి ఉన్నారు. జయప్రకాష్ నారాయణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని రాయచోటిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 22న నగరం లోని కూకట్‌పల్లి సమీపంలోని బాలాజీ నగర్‌లోని తన సోదరి ప్రశాంతి ఇంటికి వచ్చాడు. శనివారం ఉదయం వెళ్లి ఇంటికి రాకపోవడంతో సోదరి ప్రశాంతి కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జయప్రకాష్ నారాయణ శనివారం ఉదయం సోదరి ఇంటి నుంచి వచ్చి మియాపూర్ మదీనగూడలోని ఫ్లాగ్‌షిప్ ఓయో వెన్నెల రెసిడెన్సీలో రూమ్ తీసుకుని ఉండిపోయాడు. ఆదివారం మధ్యాహ్నం బయటకు రాకపోవడంతో లాడ్జి నిర్వాహకులు వెళ్లిచూడగా బెడ్‌పై అచేతన స్థితిలో ఉన్నాడు. వెంటనే లాడ్జి నిర్వాహకులు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా అప్పటికే జయప్రకాష్ మృతి చెందాడు. అతని వద్ద ఆయుర్వేదిక్ మందులు ఉండడం గుర్తించారు. మృతుడి తల్లి సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే జయప్రకాష్ నారాయణది ఆత్మహత్యా... హత్యా.. అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

కల్యాణ వైభోగమే..



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



కల్యాణోత్సవం అనంతరం మంగళ హారతి ఇస్తున్న వేదపండితులు



కోలాటం ఆడుతున్న భక్తులు

- భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

జమ్మలమడుగు : నారాపురస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం భూదేవి, శ్రీదేవి సమేత నారాపుర వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు కల్యాణం జరుపగా.. ఆ వైభవం తిలకించేందుకు భారీగా భక్తులు తరలిరావడంతో ఆవరణంతా గోవింద నామ స్మరణతో మార్మోగిపోయింది. ఈ సందర్భంగా ఆలయంలో కోలాటం అలరించింది.

నేడు రథోత్సవం : స్వామి కల్యాణోత్సవ ఘట్టం పూర్తి కావడంతో సోమవారం రథోత్సవం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రథాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీదేవి

వైభవంగా జ్యోతుల మహోత్సవం

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జ్యోతుల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి ఆలయంలోని చౌడేశ్వరి దేవికి ప్రత్యేక పూజల అనంతరం జ్యోతుల ఉత్సవం ప్రారంభించారు. మహిళలు, ప్రజలు, పిల్లలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గ్రామస్థులు ఆదివారం అమ్మవారికి బోనాలు, కాయా కర్పూరం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.



గ్రామంలో జ్యోతుల మహోత్సవం